

ఆంధ్రుల పత్రిక - అంతర్జాతీయ పత్రిక
రచన
ఇంటింటిపత్రిక
మే, 2004
100 పేజీలు
రు. 20/- :: US $ 6

# డా. ఉన్నవ గోపాలకృష్ణ (రవి) స్మారక కథల పోటీ

## రు. 25,000/- బహుమతులు!

డా. ఉన్నవ గోపాలకృష్ణ (రవి) 11-8-1939న జన్మించారు. 06-02-2004న స్వర్గస్థులయారు. ఆయన మంచి సాహితీ ప్రియుడు. తెలుగులో వ్రేళ్ళ మీద లెక్కించదగిన కథకుల్లో ఒకరైన 'చాసో'గారి కథలంటే ఆయనకు మక్కువ ఎక్కువ. తన సోదరుని అభిరుచికి అనుగుణంగా కథల పోటీ నిర్వహించాలని సుప్రసిద్ధ కథా, నవలా రచయిత్రి శ్రీమతి విజయలక్ష్మీ రామకృష్ణన్‌గారు సంకల్పించారు.

తెలుగు కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేయబూనిన ప్రయత్నాలలో ఇది మరొక ముందడుగు. కథకులందరూ ఇతోధికంగా కృషి సల్పి ఈ పోటీ ద్వారా మరిన్ని గొప్ప కథలను తెలుగు పాఠకులకు అందించాలన్నది అభిలాష!

**కథల పోటీకి సూచనలు :**

- న్యాయనిర్ణేతల తుది నిర్ణయం ఆధారంగా బహుమతి మొత్తాలను నిర్ణయించడం జరుగుతుంది.
- కథా వస్తువు ఏదైనా కావచ్చు, సమకాలీన జీవితాన్ని, మానవత్వపు విలువల్ని ప్రస్ఫుటింపజేసేవిగా ఉండాలన్నది అభిమతం.
- కథా వస్తువుని బట్టి కథ నిడివి ఉండడం సహజం. అయితే 10 పేజీలకు మించకుండా ఉంటే బావుంటుంది.
- బహుమతి పొందిన కథలు కాక, మా పరిధుల మేరకు, ప్రచురణార్హం అనుకున్న కథలు 'రచన'లో సాధారణ ప్రచురణకు అంగీకరింపబడతాయి.
- తగినన్ని స్టాంపులు అంటించిన స్వంత చిరునామా గల కవర్లను జత చేసిన కథలు మాత్రమే, ప్రచురణకు అంగీకరింపబడని సందర్భంలో, త్రిప్పి పంపబడతాయి.
- బహుమతి పొందిన కథల వివరాలు, వాటి ప్రచురణ ఆగస్టు 2004 'రచన'లో.

కథలు పంపాల్సిన చిరునామా :

**'రచన' ఇంటింటి పత్రిక**

1-9-286/3, విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర), హైదరాబాద్- 500 044.

## కథలు అందాల్సిన చివరి తేదీ : 01 జూన్ 2004

**సలహాదార్లు**

కాళీపట్నం రామారావు
కవన శర్మ
అత్తలూరి నరసింహారావు
వసుంధర
కోడూరి శ్రీరామమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
డా. ఎన్. సురేంద్ర
వై. రాంబాబు & శాయి
డా. డి.వి.ఆర్. పూషా





**మార్కెటింగ్**

**శాండిల్య మార్కెటింగ్**
5-4-670, నాంపల్లి స్టేషన్
రోడ్, హైదరాబాద్-500001
ఫోన్:4614641, 4602491

***సంపాదకుడు***

వై.వి.యస్.ఆర్.యస్.తల్పశాయి

***అసోసియేట్ ఎడిటర్***

'హంసలేఖ'

***The Only Magazine Administered by Writers***


గత సంచికలో ప్రచురించిన బహుమతి పొందిన కార్టూన్ల మీద మేం ఆశించిన దానికన్న మిన్నగా ప్రశంసలు అందాయి.

ఈ పోటీ ఫలవంతం కావడంతో శ్రీ గోపి బూరుగుగారు ఇలాంటి పోటీలను వీలును బట్టి నిర్వహించాలని ఉందన్న అభీష్టాన్ని వెలిబుచ్చారు. అందుకు కార్టూనిస్టులందరి తరఫునా కృతజ్ఞతాభివందనాలు.

అచ్చు తప్పు లేకపోతే అది తెలుగు పుస్తకం అన్పించుకోదన్నది ఒక నానుడిగా రూపుదిద్దుకోవడం మనందరికీ తెలుసు. అలాగే పత్రికల తయారీలో పొరపాట్లు దొర్లడం అతి సహజమైపోయిందీనాడు. అందుకు మేం కూడా మినహాయింపు కాదు.

గత సంచికలో 3వ పేజీలో బహుమతులు పొందిన కార్టూనిస్టుల వివరాలు ఇస్తూ **తృతీయ బహుమతి (రు.700/-)తో బాటుగా ఒక ప్రోత్సాహక బహుమతి (రు.100/-) అందుకున్న శ్రీ పి.ఎస్. కామేశ్వరరావు** కామేష్ (హైదరాబాద్) గారి పేరును పేర్కొనకపోవడం తప్పిదమే! అందుకు వారికి పత్రికాముఖంగా మన్నింపు వేడికోలు.

అంతర్జాతీయ కార్టూన్ పోటీల వివరాలకు చూడదగిన వెబ్‌సైట్‌లు : (సవరింపబడినవి) :

**www.irancartoon.com**
**www.fcw.cn**
**www.karikaturevi.com**




**ఈ పత్రిక మీది! మీ అభిరుచుల మేరకు పత్రికను రూపొందించడం మా వంతు!! అభిమానించి ఆదరించడం మీ వంతు!!!**

సంపుటి : 4
సంచిక : 2
మే : 2004

రచన ఇంటింటి పత్రిక

పేజీలు : 100
వెల : రూ. 20/-

ముఖచిత్రం : **ఎండలకూ, ఎన్నికల వేడికీ ఉపశాంతి**

చిరునామా:1-9-286/3, విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర), హైదరాబాద్-500044. ఫోన్: (ఆ) : 27071500 (ఇ) : 27077599
*email : rachanapatrika@hotmail.com, talpasai@rachana.net* *www.rachana.net*

**సంపాదకీయం..... 5**

## కథలు

రహస్యం - *తాడికొండ శివకుమారశర్మ* ... 17
ప్రీతి గన్నేరు - *జి. రామకృష్ణశాస్త్రి* ... 22
అగ్గిపుల్ల కావద్దు - *వాసంతి* ... 27
మంచి - *మాధవరపు కృష్ణ* ... 32
కథాప్రహేళిక :: రమణి ... 37
- *కానుఖేల నరసింహారావు*
మనుగడ - *శైలజా ఘట్రాజు* ... 50
అనువాద కథ :: అశక్తి దుర్జనత్వం ... 59
- *ఒరియా : తరుణ కాంతి మిశ్రా*
- *తెలుగు : మహీధర రామశాస్త్రి*
కథాపీఠం :: 'కల'వరం ... 64
- *డి. సూర్యనారాయణశాస్త్రి*
కోహినూర్ - *మాచిరాజు సావిత్రి* ... 71
నిలువు దోపిడి - *సుజాతా శ్రీనివాస్* ... 78
భ్రమ - *పుచ్ఛా శాస్త్రి* ... 86
అద్దాల మేడ - *సయ్యద్ ఖుర్షీద్* ... 90

## సీరియల్ రచనలు

సీత (ఉత్తర ఖండము)
- *విశ్వనాథ అచ్యుతదేవరాయలు* ... 14
సైన్సు నడచిన బాట - *డా॥ కవనశర్మ* ... 47
శ్రీరాముని దయచేతను... - *వసుంధర* ... 93

## ప్రత్యేక రచన

అన్నమయ్య స్వరగంగ ... 34
- *కామిశెట్టి శ్రీనివాసులు*

## శీర్షికలు

ఉత్తర రచన ... 6
మూడు ప్రశ్నలు - ఒకే సమాధానం ... 7
పజిలింగ్ పజిల్ - *అవసరాల రామకృష్ణారావు* ... 8
సాహితీవైద్యం - *వసుంధర* ... 53
చిన్ని Noteలో ఎన్నెన్నో . . . . ... 84
- *అవసరాల రామకృష్ణారావు*
రచనా సమీక్ష - *డి. వెంకట్రామయ్య* ... 97

## కవితాలంకారికులు

అక్కినపల్లి సుబ్బారావు ... 2
చంద్ర కన్నెగంటి ... 46
శాంతి నేమాని ... 52
ఉమ ... 99

## విశేష రచన

సిలికానాంధ్ర ఉగాది వేడుకలు ... 11

## అక్కడక్కడక్కడా

కార్టూన్లు

# సిలికానాంధ్ర - శ్రీ తారణ ఉగాది ఉత్సవం - కవితాగాన లహరి


విదేశీ గడ్డ మీద సంప్రదాయ బద్ధంగా ఉగాది ఉత్సవాల్ని జరుపుతూ, గత రెండేళ్ళుగా కాలిఫోర్నియాలో కవిసమ్మేళనాల్ని విజయవంతంగా నిర్వహించిన 'సిలికానాంధ్ర' ఈ తారణ ఉగాదికి కూడా మరోసారి కవి సమ్మేళనం - కవితా గానలహరిని నిర్వహించింది. తెలుగువారు ఎక్కడున్నా తమ సంస్కృతీ సంప్రదాయాల పట్ల ఎనలేని మమకారం కలిగి వుంటారనడానికి నిలువెత్తు నిదర్శనం, మార్చి 21న కవితాభిమానులతో కిక్కిరిసిన సిలికానాంధ్ర సభాప్రాంగణం. గత రెండేళ్ళ నిర్వహించినట్లే ఈసారి కూడా లివర్‌మోర్ హిందూ దేవాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. తాము నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ఏదో ఒక నవ్యతని ఆవిష్కరించే సిలికానాంధ్ర ఈసారి కార్యక్రమ నిర్వహణ బాధ్యతల్ని పూర్తిగా యువతరానికి అప్పగించింది. సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న 12 - 15 వయసుగల బాలబాలికలే కార్యక్రమం అంతా నిర్వహించారు. అతిథుల్ని ఆహ్వానించడం, కార్యక్రమ వ్యాఖ్యానం, పాటలు పాడడం అన్నీ కూడా ఈ బాల బాలికలే నిర్వహించడం ఒక విశేషం. అమెరికాలో పుట్టి పెరిగిన పిల్లలు కూడా స్వచ్ఛమైన తెలుగులో కార్యక్రమ వ్యాఖ్యానం చేయడం, సభికులకి ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ కూడా కలిగించింది.

దేవాలయం ప్రవేశ ద్వారం వద్ద నుంచీ కవితా గానలహరి సభా మందిరం వరకూ మామిడి ఆకులూ, రంగు రంగుల జెండాల తోరణాలతో అలంకరించారు. సభామందిరం అంతా అచ్చమైన తెలుగు వాతావరణం ప్రతిబింబించింది.

క్రమశిక్షణకి పెట్టింది పేరైన సిలికానాంధ్ర సరిగ్గా సాయంకాలం 4.00కి కార్యక్రమం - ఆరంభించింది. పంచాగ శ్రవణం, కవి సమ్మేళనం, గానలహరి, శ్రీమతి అవసరాల (వింజమూరి) అనసూయాదేవిగారికి సన్మానం, పద్య పఠనం, బాల బాలికలు బహుమతి ప్రదానం, ప్రత్యేకంగా రూపొందించిన లఘు వీడియో చిత్రాలూ, ప్రేక్షకులు పాల్గొన్న ఫొటో కవితలూ, వెరసి, ఇవన్నీ కలిసి మూడు గంటల కార్యక్రమాన్ని ఒక వర్ణభరిత మనోహర దృశ్య, శ్రవణ కదంబంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ కుమారి కూచిభొట్ల అనూష "మేమంతా అమెరికాలోనే పుట్టి పెరిగినా, మన దేశమన్నా, అమ్మా, నాన్నల వూళ్ళన్నా చాలా ఇష్టం. మన పండుగల గురించి కూడా అమ్మా, నాన్నలు మాకు ఎప్పుడూ చెబుతూ ఉంటారు. అందుకే ఈ రోజు మన వూరిని గుర్తు తెచ్చేలా ఈ పండుగ జరుపుకుందాం..." అంటూ స్వాగత వచనాలు పలికింది. పన్నెండేళ్ళ గుడిపాటి కార్తీక్ ఆనాటి కవి సమ్మేళనంలో పాల్గొనే కవులందరన్నీ వేదిక మీదకి ఆహ్వానిస్తూ "కొత్త సంవత్సరం రోజు కమ్మటి కవితల్ని వినడం తెలుగు వారి ఆచారంలో ఒక భాగం. ఈ రోజుల్లో టి.వి.లూ, సినిమాలూ పెరిగిపోయినా కవులకూ, కవిత్వానికీ ఆదరణ అలానే ఉంది. అర్థం చేసుకుంటూ, వింటుంటే కొద్దీ పంక్తుల్లో కూడా ఎంతో అర్థాన్ని నింపే కవితలు అందరికీ నచ్చుతాయి...."అన్నాడు.

మారేపల్లి వెంకటశాస్త్రిగారి పంచాంగ పఠనం హాస్యోక్తులతో సరదాగా సాగింది. ఆయా నక్షత్రాలకు చెందిన ప్రేక్షకులు తమ ఆదాయ వ్యయాల్నీ, అవమాన పూజ్యాలనీ ఒకటికి రెండుసార్లు అడిగి తెలుసుకున్నారు. తరువాత రెండు విడతలుగా, డాక్టర్ గుండ్లాపల్లి రవిశంకర్‌గారి - ఆధ్వర్యంలో, సాగిన కవి సమ్మేళనంలో శ్రీ గండికోట విశ్వనాథం, శ్రీ వారణాసి వెంకటరావు, శ్రీపోలవరపు రమణ, శ్రీ ప్రఖ్య వంశీకృష్ణ, శ్రీ నేమన గోపాల్, శ్రీ జొన్నలగడ్డ భాస్కరరావు, శ్రీమతి గునుపూడి అపర్ణ పాల్గొని తమ మధురమైన కవితల్ని, పద్యాల్ని వినిపించారు. వీరిలో శ్రీ గండికోట విశ్వనాథం, శ్రీవారణాసి వెంటరావుగార్లు ఇండియా నుంచి వచ్చిన కవులు కావడం, శ్రీ నేమన గోపాల్‌గారు గత పాతికేళ్ళుగా అమెరికాలో ప్రముఖ హృద్రోగ నిపుణులుగా కొనసాగుతుండడం,




శ్రీ పోలవరపు రమణగారు పుట్టుకతో అంధులైనా ఆంధ్రదేశం నుంచీ అమెరికా వచ్చి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకోవడమేగాక, కంప్యూటర్ రంగంలో కూడా నైపుణ్యం సంపాదించి, పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తుండడం గమనించదగ్గ విశేషాలు. వీరు చదివిన కవితలు, ప్రముఖ కవుల రచనలతో పోటీ పడకపోయినా తమకంటూ సంతరించుకున్న ఒక ప్రత్యేకతతో ఆనాటి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా తన అంతర్నేత్రంతోనే ప్రపంచం అందాల్ని చూసే శ్రీ పోలవరపు రమణగారు, "అనామికను మరీచికను. ఎదపగుళ్ళలో హిమీభవించిన హేమంత నిశాచంద్రికను...'' అంటూ చక్కటి పదచిత్రాలతో చదివిన కవిత ప్రేక్షకుల్ని ఉద్విగ్నభరితుల్ని చేసింది.

శ్రీ గోపాల్‌గారు "*గంధము పూయరుగా...*" కీర్తనకి అనుసరణగా పాడిన '*సేవలు సేయరుగా...*' పాటకి ప్రేక్షకులంతా తాళం కలపడమే గాక పాటలో ఆయన వర్ణించిన పత్నీ సేవల గురించి తెలుసుకుని హాయిగా నవ్వుకున్నారు. గండికోట విశ్వనాథం గారి పద్యాలు కూడా హృద్యంగా సాగాయి. కూచిభొట్ల రవీంద్రగారు పాడిన బమ్మెర పోతన పద్యాలకు ప్రేక్షకులు వన్స్‌మోర్‌లు పలకడం తెలుగు పద్యానికి గల ఆదరణని నిరూపించింది. ప్రముఖ రచయిత శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ గారు కూడా తమ ఉగాది కవితని టెలిఫోన్ ద్వారా సిలికానాంధ్ర ప్రేక్షకులకి వినిపించారు.

కేవలం వేదిక మీదనున్న కవులే గాక నాటి కార్యక్రమానికి హాజరైన పలువురు కవితాభిమానుల్ని కూడా కవితాగానంలో భాగస్వాముల్ని చేస్తూ శ్రీ కిరణ్‌ప్రభ నిర్వహించిన 'ఫొటో కవితల' పోటీలో యాభైమందికి పైగా ప్రేక్షకులు పాల్గొన్నారు. పెద్ద తెర మీద చూపించిన నాలుగు ఫొటోలకి వీరంతా కార్యక్రమం ముగిసే లోగా కవితలు అల్లారు.

కవి సమ్మేళనానికి మధ్య మధ్యలో సాగిన గానలహరిలో నండూరి సుబ్బారావుగారి ఎంకి పాటల్ని బాల గాయనీ గాయికలు మధురంగా ఆలపించారు. ఈ పాటలకి పరిచయ వాక్యాలు పలికిన కుమారి ఉపద్రష్ట ప్రణవ ఎంకి పాటల పుట్టు పూర్వోత్తరాల్నీ, నండూరివారు మొదటి పాట రచించిన వైనాన్ని ఆసక్తికరమైన కథారూపంలో వివరించింది. ఈ ఎంకి పాటల్ని కుమారి సర్వాశృతి, కుమారి మేడికుర్తి శృతి, కుమారి పరిగె హారిక, కుమారి ఈరబత్తిన మనీష, చిరంజీవి విస్సా మాధవ్ ఆలపించారు. వినయమణిగారి ఆధ్వర్యంలో, వక్కలంక సూర్య, నెల్లూరి హైమా నంద్‌ల సంగీత దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ లలిత గీతాలు సిలికానాంధ్రులకి మరోసారి తమ పల్లె సీమల్ని గుర్తుకు తెచ్చాయి.





ప్రముఖ జానపద గాయని, కళాప్రపూర్ణ డాక్టర్ అవసరాలు (వింజమూరి) అనసూయాదేవిగారికి సన్మానం ఈ ఉగాది ఉత్సవంలో ప్రత్యేక అంశంగా చోటు చేసుకుంది. శ్రీమతి అనసూయాదేవి గారిని, కుమారి మాధురి పోతిరెడ్డి సభకి పరిచయం చేస్తూండగా అనసూయాదేవి గారి జీవితంలోని ముఖ్యమైన ఘట్టాల్ని దృశ్యరూపంలో పెద్ద తెర మీద ప్రదర్శించారు. ఎనభై నాలుగేళ్ళ వయసులో కూడా అత్యంత ఉత్సాహంగా ఉన్న శ్రీమతి అనసూయాదేవిగారి పాటకి డెభై ఐదేళ్ళు నిండిన సందర్భంలో జరిగిన ఈ సన్మానం కన్నుల విందుగా సాగింది. సిలికానాంధ్ర కార్యనిర్వాహక వర్గం అందరూ కలిసి ఈ సన్మానకార్యక్రమాన్ని నిర్వహించారు. సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుతూ శ్రీమతి అనసూయాదేవిగారు, "గత 75ఏళ్ళుగా నన్ను దరించిన మీలోని రసజ్ఞతకి నా కృతజ్ఞతలు" అన్నారు. అనంతరం ప్రేక్షకుల కోరికపై '*ఎంతటి వాడే చిన్న కృష్ణుడు...*' అన్న పాటని పాడారు శ్రీమతి అనసూయాదేవిగారు. పాటకి ప్రేక్షకులంతా వంతకలపడమే గాక చివరలో అందరూ నిలబడి నిరంతర కరతాళధ్వనులతో మహా గాయనికి తమ గౌరవాభివందనాలు తెలియజేశారు.

తాము నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమానికీ అనుబంధంగా ఒక పుస్తకాన్ని ప్రచురించి, దానిని ప్రేక్షకులకి ఉచితంగా అందించడమనే సంప్రదాయాన్ని సిలికానాంధ్ర మొదటి నుంచీ క్రమం తప్పకుండా పాటిస్తోంది. మరే ప్రవాసాంధ్ర సంస్థా చేపట్టని ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రతి సారీ 'రచన' శాయిగారు తమ వంతు సహాయ సహకారాల్ని అందిస్తున్నారు. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈసారి కూడా

సిలికానాంధ్ర 'సుజనరంజని' శ్రీ తారణ ఉగాది ప్రత్యేక గేయసంకలనాన్ని వెలువరించింది. గత ఆగస్ట్ నెలలో 'రచన'మాస పత్రిక సహకారంతో నిర్వహించిన పాటల పోటీలో గెలుపొందిన పాటలతో బాటు మరికొన్ని పోటీకి వచ్చిన పాటల్ని చేర్చి ఈ ప్రత్యేక సంచిక సర్వాంగ సుందరంగా రూపొందింది. సిలికానాంధ్ర శ్రేయోభిలాషి, ప్రముఖ వైద్యులు శ్రీ లక్కిరెడ్డి హనిమిరెడ్డి గారు ఈ 'సుజనరంజని'ని ఆవిష్కరించారు.


ఆనాటి కార్యక్రమంలో మరొక ప్రత్యేక అంశం 'చిన్నారి బాలబాలికలకు చిట్టి పొట్టి పాటల పోటీలు'. ప్రధాన కార్యక్రమానికి ముందు మధ్యాహ్నం 1.00నుంచి 3.00 వరకూ జరిగిన ఈ పోటీల్లో వందమందికి పైగా 3-10 సంవత్సరాల వయసున్న చిన్నారులు పాల్గొన్నారు. సిలికానాంధ్ర ఒక నెల రోజులు ముందుగా ఎంపిక చేసిన 25 చిట్టిపొట్టి పాటల్ని తమ వెబ్‌సైట్‌లో ప్రచురించారు. 'వానా వానా వల్లప్ప...', 'చేత వెన్న ముద్ద...', 'చుక్... చుక్ రైలు..' లాంటి బుజ్జి, బుజ్జి పాటలు చిన్నారులు ఒక్కొక్కరూ ఐదు చొప్పున నేర్చుకుని న్యాయనిర్ణేతల ముందు పాడారు. ఈ విధంగా తమ పిల్లలకి తెలుగు పాటలు నేర్పే అవకాశాన్ని కల్పించిన సిలికానాంధ్ర కృషిని తల్లిదండ్రులంతా ప్రశంసించారు. పోటీల్లో బహుమతి పొందిన వారికి శ్రీ బొబ్బా వెంకటాద్రిగారు, శ్రీ వేముల గౌడ్ గారూ బహుమతి ప్రదానం చేశారు. పోటీల్లో బహుమతి పొందిన చిన్నారులు, వెయ్యి మంది ప్రేక్షకుల సమక్షంలో ఏ మాత్రం నదురు బెదురు లేకుండా మరలా ఆ పాటల్ని పాడి వినిపించారు.

ఈ పాటలలో కొన్నింటిని శ్రీ గొర్తి బ్రహ్మానందం వీడియో రూపకంగా చిత్రీకరించి పెద్ద తెర మీద ప్రదర్శించారు. మల్టీ మీడియాని ప్రతి కార్యక్రమంలోనూ అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటున్న సిలికానాంధ్రని పలువురు ప్రశంసించారు.




ఇంకా ఈ కార్యక్రమంలో సిలికానాంధ్ర అధ్యక్షుడు కొండిపర్తి దిలీప్, సంస్థ గత సంవత్సరం నిర్వహించిన కార్యక్రమాల్ని సమీక్షిస్తూ, "సోదర తెలుగు సంస్థలతో కలిసి కార్యక్రమాలు నిర్వహించడమనే సంప్రదాయానికి నాంది పలికిన సిలికానాంధ్రకు ప్రపంచ వ్యాప్తంగా వున్న తెలుగు సంస్థల నుంచీ ఎన్నో ప్రశంసలు అందుతున్నాయి" అన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ ప్రసంగిస్తూ, "మన దేశం వదిలి ఎంత దూరం వచ్చినా మనలోని తెలుగుదనం... సహజీవన సౌందర్య ఎక్కడికీ పోదు..." అంటూ రాబోయే మే నెలలో జరుగనున్న 'వసంతంలో వసుధైక కుటుంబం' ఆంధ్రా కాంప్ గురించి వివరించారు.

కార్యక్రమం చివరగా ఆహూతులందరికీ అనిల్ అన్నం ఆధ్వర్యంలోని కమిటీ సభ్యులు అల్పాహారం అందేశారు. ఇందుకోసం దాదాపు వందమంది సిలికానాంధ్ర అన్నపూర్ణలు పులిహోర, చక్రపొంగలి, దద్దోజనం వండి తెచ్చారు. మరొక మరపురాని అనుభూతిని మిగిల్చిన ఈ ఉగాది ఉత్సవం సరిగ్గా 7.00కి, కార్యదర్శి శ్రీ రామకృష్ణ వందన సమర్పణతో ముగిసింది. ❀



# రహస్యం

ఊరికి దూరంగా వున్న ఆ ప్రదేశం ఎత్తు పల్లాలతో, రాయి రప్పలతో ఎగుడు దిగుడుగా వుంది. అక్కడక్కడా పెద్ద పెద్ద కొండరాళ్ళు. రాత్రి ప్రదేశం అవడం వలన దూరదూరంగా అక్కడక్కడా మాత్రమే పెద్ద వృక్షాలు కనిపిస్తున్నాయి. చదునుగా చేసిన ప్రదేశంలో ఒక పర్ణశాల. దానికి దగ్గరగా కొందరు రాజభటులు. వాళ్ళ దృష్టి మాత్రం పర్ణశాల వైపు కాక అక్కడికి కొద్ది దూరంలో నిలబడ్డ రాజకుమారుల మీద, వారి గురువు ద్రోణాచార్యుల మీద నిమగ్నమై ఉంది.

తన ముందు నిలబడ్డ కురు, పాండవ సోదరుల్ని పరకాయిస్తున్న ద్రోణాచార్యుల వారి మదిలో ఆలోచనలు -

హస్తినాపురంలో ఈ వుద్యోగం తనకు అదృష్టవశాత్తు దొరికిందనే చెప్పుకోవాలి. తన బావమరిది కృపుని సహాయంతో ధృతరాష్ట్రుని కొలువులో తనకు ఉద్యోగం లభిస్తుందేమోనని నిన్న ఇటు వస్తున్నప్పుడు హస్తినాపురపు పొలిమేరల్లో ఈ రాజకుమారుల్లో కొంతమంది ఒక బావి వద్ద గుమిగూడి ఉండడం తను చూశాడు. వారికి కొద్దిదూరంలో వేరొక రాజకుమారుల గుంపు పోగై ఉంది. ఆ గుంపు మధ్యలో ఇద్దరు రాజకుమారులు కుస్తీ పడుతున్నారు అరుచుకుంటూ - 'తప్పు నీదంటే నీదని, నువ్వు కావాలని బావిలో పడేశా'వని ఒకడంటే 'నీకు పట్టుకోవడం చేతకాలే'దని రెండవ వాడు అంటూ. వాళ్ళ చుట్టూ మూగిన మరి కొందరు రాజకుమారులు ఆ యుద్ధాన్ని ప్రోత్సహిస్తూ మధ్య మధ్యలో చప్పట్లు కొడుతున్నారు. ఏమిటని విచారిస్తే వాళ్ళు ఆడుకునే బంతి బావిలో పడిపోయిందనీ, దాన్ని బయటకు తీసే మార్గం తెలియక చూస్తున్నారని, కుస్తీ పడుతున్న వాళ్ళ పేర్లు దుర్యోధనుడు, భీమసేనుడు అని తెలిసింది. అప్పుడు ముందు వారిద్దరి మల్లయుద్ధాన్ని వారించి, బంతిని తను వెలుపలికి తీస్తానన్నాడు.

'ఇక్కడ గాలము, తాడు, చేద ఏమియును లేవు' వినయంగా అన్న బాలుని వైపు చూసి తను చిన్నగా నవ్వాడు- 'వాటి అవసరం లేదు' అని అర్థం వచ్చేలాగా. ఆ బాలుని పేరు యుధిష్ఠిరుడని తరువాత తెలిసింది.

బావి నీటిలో తేలుతున్నది నూలు బంతి. విలువిద్యా ప్రావీణ్యత నుపయోగించి తను ఆ బంతిని బయటకు తీద్దామని అనుకున్నాడు. ఒక బాణం వెనుక ఇంకొక బాణాన్ని గురి చూసి వేసి, బాణాలతో తాడుని తయారు చేసి ఆ తాడుతో బంతిని పైకి లాగవచ్చునని తను అనుకున్నాడు. అమ్ముల పొదిలోంచి బాణాన్ని తీసి, నారిని సంధించి మొదటి బాణాన్ని వదిలిన తరువాత కానీ ఆ ఆలోచనలోని లోపమేమిటో తనకు తెలిసి రాలేదు.

'నీటిలో తేలుతున్న బంతి బలంగా వచ్చి తాకిన బాణపు ధాటికి మొదట నీటిలో మునిగింది. తరువాత, బాణం దిగబడిన ఆ బంతి, బాణపు జడత్వం బంతి జడత్వం కన్నా ఎక్కువగుట చేత, నీటిలో పక్కకు తిరిగింది. బంతిలో గ్రుచ్చుకున్న బాణం పక్కకు ఒరిగి, చెక్కతో తయారుచెయ్యబడినదగుట చేత నీటి మట్టమునకు సమాంతరంగా యుండునట్లుగా నీటిలో తేలింది. దానితో బాణముల త్రాడుతో బంతిని వెలుపలకు తీయవచ్చునన్న తన యూహ తలక్రిందులైంది. ఇంకొక బాణము వేసినా మరల అదే పరిస్థితి అని అర్థమయిన తరువాత ఆ పరిణామము తనకు ముందు ఆశ్చర్యమునూ, అటు పిమ్మట తనలో అలజడినీ కలిగించింది.

'తను ధృతరాష్ట్రుని కొలువులో ఉద్యోగమును అర్థించి వచ్చినవాడు. హస్తినాపురపు పొలిమేరలలో అడుగు పెడుతూండగనే తనకీ పరీక్షా? ఈ బంతిని వెలికితీయు ప్రయత్నములో తను విఫలుడైనట్లు ధృతరాష్ట్రునికి తెలిసినచో అతని కొలువులో తనకు ఉద్యోగము లభించునా? ఉద్యోగము లభించకపోయిననూ బంతిని వెలికి తీయుదునని తను పలికిన పలుకులు డంబములవవలసినదేనా? తన విలువిద్యా ప్రాభవము ఈ బాలల ముందు అపహాస్యము కావలసినదేనా? తను ఈ గండము నుండీ బయటపడుటెట్లు?

'అప్పుడు తన మనస్సులో ఒక చిన్న ఆలోచన కలిగి, గంగా నదీ ఉరవడిలో

తాడికొండ శివకుమార శర్మ

కొట్టుకుపోతున్న వానికి చేజిక్కిన ఒక చెట్టు కొమ్మ మాదిరి తనకు కొంచెం ఆధారము దొరికినట్లయింది - తన ఉత్తరీయమునకు ఈ బాలల ఉత్తరీయములను కలిపి, వాటిని ఒక బాణమునకు ముడివేసి, ఆ బాణమును బంతికి గురి చూసి వదిలి నచో? అట్లు చేసినచో ఆ వస్త్రముల బరువుకు బాణము గురి తప్పునని విలు విద్యా ప్రావీణ్యత తనను హెచ్చరించింది. తన పలుచని ఉత్తరీయములోని నూలు పోగులను విడదీసి, సన్నని త్రాడుగా కూర్చి, ఆ త్రాడును బాణమునకు ముడివేసి, బాణమును వదిలినచో? అది సంభవమే నని విలువిద్యా ప్రావీణ్యత అనుమతిని చ్చిన తరువాత తను బాణము వేయుట, దారపు సహాయముతో ఆ బంతిని బయ టకు లాగుట, దాని వలన రాజదర్శనము కలుగుట, ఈ బాలలకు గురువుగా నియ మింపబడుట జరిగింది. దాని ఫలితమే తను ఆచార్యునిగా ఈ రాజకుమారుల ముందు నిలబడుట. ఆ సమయోచిత యోచన తనకు సంభవించనిచో తను ఉదర పోషణార్థం... ఆ ఆలోచననే ఇక నా దరికి రానివ్వను' అని ద్రోణాచార్యులు ప్రతిజ్ఞ చేసుకొన్నారు.

'ఈ రాజకుమారులకు తను యుద్ధ విద్యలు నేర్పాలి. వీరందరికీ అస్త్ర విద్యలో కొంచెము ప్రవేశము కలదని తనకు భీష్మా చార్యుల వారు తెలియజేశారు. వీరిలో అస్త్ర శస్త్ర ప్రావీణ్యము ఏ ఒకరికో లేక ఇద్దరికో మాత్రము అబ్బునని తను అనుభవముతో తెలుసుకున్న విషయము. మరి వీరందరూ భీష్మాచార్యులవారి మను మలే! ఆ రక్త సంబంధము వలన వీరం దరూ అస్త్ర శస్త్ర ప్రావీణ్యులగుదురా? పరికించవలయును.'

ఆయన తన ఆలోచనలను ఆపి ఆ రాజకుమారుల నుద్దేశించేటంతలో అర్జు నుని చెయ్యి పైకి లేచింది.

'ఏమి నాయనా?' మృదుస్వరంతో ప్రశ్నించారు.

అర్జునుడు చేతితో పొట్టను పట్టుకుని దూరంగా వున్న పొదల వైపు చూపించాడు. వెళ్ళవచ్చునని చేతితో ఆయన సైగ చెయ్యి గానే పరుగున వెడుతున్న అర్జునుని వైపు, అతని వెనుకనే పరిగిడుతున్న రక్షకభటుని వైపు ఒక క్షణ కాలము చూసి ఆయన మిగిలిన రాజకుమారులను సంభోదిం చారు.

'బాలలారా, ఆ వృక్షోపరిభాగమును చూచితిరా?'

రాజకుమారుల దృష్టి ద్రోణుని కుడి చేయి చూపుడు వ్రేలి దిక్కుగా మరలి, అది అక్కడకు ఏబది గజముల దూరంలో కల ఒక మర్రి చెట్టు ఉపరి భాగము వైపు పయనించింది.

దాని మీద ఒక మృణ్మయ పక్షి వున్నది. దానిని ఆయన అశ్వత్థామ చేత ఆ ఉదయ ముననే అక్కడ పెట్టించారు.

'మీరు మీ విల్లులకు బాణమును సంధించి, ఆ పక్షి కంటికి గురిపెట్టి బాణములను వేయండి. దుర్యోధనా, ముందుగా నీవు ఇచ్చటికి వచ్చి ప్రయ త్నించుము.'

దుర్యోధనుడు, ద్రోణుడు చూపించిన స్థలానికి వచ్చాడు. అమ్ముల పొదిలో నుంచి బాణాన్ని తీసి, వింటికి సంధించి గురి చూశాడు.

'దుర్యోధనా, పక్షి కనిపించినదా?' - ఆయన గొంతులో సందేహము.

'కనిపించినది గురుదేవా' దుర్యోధనుని గొంతులో 'కనిపించక ఎక్కడికి పోతుం' దన్న దృఢమైన ఆత్మవిశ్వాసము.


'అయిన బాణమును వదులుము.'

దుర్యోధనుడు బాణాన్ని వదిలాడు. అది వృక్షోపరిభాగము వైపు పయనించి, పక్షికి తగులకనే నిర్వీర్యమై క్రింద రాలింది. దుర్యోధనుడు విఫలుడైనాడు.

తరువాత దుశ్శాసనుని వంతు. ఆ తరువాత మిగిలిన కౌరవుల వంతు. వారం దరూ దుర్యోధనుని మార్గమునే అను సరించి బాణములను వదులుటచేత అందరూ విఫలులైనారు. కొన్ని బాణ ములు చెట్టు కొమ్మలకు గ్రుచ్చుకొన్నవి. అలా గ్రుచ్చుకొనక క్రింద పడిన బాణము లన్నియు ఒక కుప్పగా తయారైనవి. వీరిలో ఎవరూ కృతకృత్యులవకపోవడం మాత్రమే కాదు ద్రోణుని ఆశ్చర్యపరిచింది. వారి గురి పక్షి వైపే లేదు. ఇదెటుల సంభవము?

ఈ మధ్యలో అర్జునుడు మూలశంక తీర్చుకుని వచ్చాడు. నిలబడి వున్నంత సేపూ ఉదర భాగాన్ని చేతితో పట్టుకుని బాధ పడుతూనే ఉన్నాడు. మధ్యమధ్యలో పొదల వైపు పరిగెడుతూనే వున్నాడు. అతను తన మనసుని అక్కడ జరుగుతున్న కార్యక్రమం మీద కేంద్రీకరించలేకపోతు న్నాడు. నూరుగురు కౌరవుల తరువాత పాండవుల వంతు వచ్చింది.యుధిష్ఠిరుడు, భీమసేనుడు, నకులుడు, సహదేవుడు కూడా కౌరవుల మార్గమునసనుసరించి విఫలులైనారు. చివరగా అర్జునుని వంతు వచ్చింది.

(మిగతా భాగం పత్రికలో చదవండి)



సాంకేతిక కారణాల వల్లనే అయినా జనవరి సంచికని కథలకు మాత్రమే పరిమితం చెయ్యడం నాకు నచ్చింది. సంవత్సరంలో ఒక సంచికని ఇలాగే కథలకు మాత్రమే పరిమితం చేస్తే బావుంటుందని నా అభిప్రాయం - ముఖ్యంగా ఒక "అనగనగా ఓ మంచి కథ'', అవార్డు పొందిన కథలకు అనువాదాల్ని చేర్చి.

జనవరి సంచికలో గిడుగు రాజేశ్వర రావుగారి కథ *'కథాపీఠం'* పురస్కారాన్ని అందుకునే అర్హత గల కథ. *"అంతం కాదిది ఆరంభం"* ఓ పదిహేను సంవత్స రాలు ఆలస్యంగానే వ్రాయబడ్డా, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మరో పదిహేను సంవత్సరాలకు కూడా ఈ కథ కిచ్చిన ముగింపు ఇలలో దొరకదని నమ్మకంగా ఉంది.

ప్రతి యతీశ్వరుడు స్వాభిలాషతోనే మనఃపూర్వకంగా సన్యాసాన్ని స్వీకరించి వుండడన్న సత్యాన్ని అందజేశారు ఘండికోట బ్రహ్మాజీరావుగారు "ఇద్దరు యతీశ్వరులు" అన్న కథలో. అయితే, ఎందుకో కథ చివర ఏదో లోపించి సందే శానికి కావల్సినంత బలం అందలేదని అనిపిస్తుంది. సలీంగారి *"శిథిల శిల్పాలు"* లో కథ, కథనం బావున్నాయి.

తానా పత్రిక సౌజన్యంతోనూ, దానితో ప్రమేయం లేకుండానూ 'రచన'లో ప్రచు రితమైన డయాస్పోరా సాహిత్యంలో కథా వస్తువుకు తగినట్లుగా కథనానికి ప్రాధాన్యత కొంతమంది రచయిత(త్రు) లు ఇచ్చివుంటే బావుండేది. అచ్చులో ఒక పేజీ అంతా ఒకే ఒక్క పేరాతో నిండిపోతే పేజీ తిప్పాలనిపిస్తుంది కానీ చదవాలని పించదు. ఏకపక్ష లేక ఉపన్యాసధోరణి ప్రవాసాంధ్రులకి మాత్రమే పరిమితం కాలేదనిపిస్తుంది- 'రచన'లో ఈ మధ్యలో ప్రచురితమైన పాలెపు బుచ్చిరాజుగారి కథలు చదివిన తరువాత.

ఇక ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి




'రచన'లో జనవరి సంచికలోనే కాక క్రితం సంవత్సరంలో కూడా 'రచన'లోనే ప్రచురింపబడిన కాశీభట్ల వేణుగోపాల్ గారి కవితలు, కథలు. వాటి స్ఫూర్తితో ఓ మినీ కథ -

❀ ❀ ❀

బీటలు వారిన ఆకాశం నుండీ భూమ్మీదకు పూడిపడ్డ సూర్య కిరణాలు కొండలక్కొట్టుకొని, ఫెళ్ళున విరిగి నిశ్శబ్దంలో విస్ఫోటాల్ని కురిపిస్తూ విలపి స్తూంటే జాలేసి, ఆపోశన పట్టి తుపుక్కున వూసిన అగస్త్యుడి బ్రెయిన్ లోని ఆలోచనా శకలాల్ని చూస్తే వాత్సా యనుడికే కాక జార్జి బుష్‌కి కూడా మతి పోతుందన్నాడు బభ్రువాహనుడు.

చదరంగా వున్న వాడిని వూపిరాడ కుండా చంకలో ఇరికించుకుని కైలాస పర్వతాన్ని పెకిలిద్దామనుకుని కూడా సముద్రాల్లో ఈత కొడితే చాలనుకున్న కార్తవీర్యార్జునుడు గిరికీలు కొట్టడం వల్లనే సూర్యుడు గుండ్రంగా తయార య్యాడని, కావాలంటే వీనస్ విలియమ్స్ ని విజయ్‌సింగ్ ఓడిస్తే నెపోలియన్‌ని వీరబాదుడు బాదబోయే ఇందిరాగాంధీని అడగమన్నాడు నందాత్మజుడు.

ఐన్‌స్టీన్ అయిదవ తనయూ, ఆంజనేయుడి ఆరో తనమూ, ఏకలవ్యుడి ఏడవ తనమూ, హిమగిరి తనయ హికప్పు కలిపి వేయించిన అలకా కలన గణితం కన్నా పిలకా గణపతిశాస్త్రిగారి హాఫ్ వాలీలే అతిలోక సుందరి అవయవ సంపదకి ఎనలేని సొంపన్నాడు ధృత రాష్ట్రుడి అనుంగు సోదరుడి వేలు విడి చిన పినమామ ముని మనవడు ముషారా ఇషారాఫ్.

"బాబోయ్! నన్ను చంపినా ఫరవా లేదు గానీ ఉప్పు పాతర మాత్రం వెయ్య కండి" అంటూ విలపిస్తూ లేచాడు పారా యణం మధ్యలో చతుర్ముఖుడు - రాజు వంటి మీద గుడ్డల్లేవని చెప్పిన బాలుడిని మంచు కొండల మధ్యలో సింహానికి ఎరగా వేశారో లేక పోరంకిలో పోలార్ బేర్ మెడలో వేశారో తెలీక, పీకి అరచేతిలో పెట్టిన బ్రెయిన్ మంచులా మరిగి పోతుండగా.

❀ ❀ ❀

పికాసో ఇంటికి ఒక మిత్రుడొచ్చేసరికి పికాసో తన పెయింటింగ్ ముందు నిలబడి దాన్నే తదేక దీక్షతో చూస్తున్నాట్ట. అప్పుడా మిత్రుడు, "ఏమిటి దాన్ని అంత సేపు చూస్తున్నావ్?'' అనడిగాట్ట.

దానికి పికాసో, ''ముక్కు సరిగ్గా రాలేదు. అందుకని'' అని జవాబిచ్చాట్ట.

కాసేపయిన తరువాత ఆ మిత్రుడు ధైర్యాన్ని కూడగట్టుకుని, "ముక్కు ఎక్కడ వుంది?'' అనడిగాట్ట.

దానికి పికాసో, ''దాని కోసమే నేనూ వెతుకుతున్నాను'' అని జవాబిచ్చాట్ట.

***తాడికండ కె. శివకుమార్ శర్మ,***
(అమెరికా)

నమస్సులు. వర్తమాన తెలుగు సాహిత్యానికి ఎంతో సేవ చేస్తున్న మీరు, ఎందరో ప్రవాసాంధ్రుల మనసు దోచు కున్నారని నేను కొత్తగా చెప్పనవసరం లేదు. నేనూ వారిలో ఒకడిని. చాలా కాలంగా 'రచన' గురించి వింటూ, అడపా దడపా ఒక్కొక్క సంచికని తిరగే యడమే తప్ప సబ్‌స్క్రైబ్ చేద్దామనే ఆలోచన ఎందుకు నాలో కలుగలేదో తెలియదు. ఇన్నాళ్ళకి, ప్రస్తుతం తెలుగు సాహిత్యం ఎటు వెళుతూందో తెలుసు కోవాలన్న తపన నాకెక్కువయింది. యధాశక్తి నేనూ నా వొంతు తెలుగు సాహిత్య సేవ చేద్దామనే సంకల్పం కలి గింది. రచయితనయ్యే ముందు మంచి




**138**

కూర్పరి : **తాండ్యాల రామచందర్** (చెన్నూర్)

1. కన్నప్పుడు 'పోషించము' అంటే కుదరదు గాక కుదరదు. ఏమిటది?
2. ఎన్ని టిఫిన్స్ తిన్నా 'ఇది' తిన్నంత తృప్తి ఉండదు. ఏమిటది?
3. దీనికి 'ప్ర' చేరిస్తే కోవెలలో దొరికేది. ఏమిటది?

**పై మూడు ప్రశ్నలకి కలిపి ఒకే సమాధానం రాసి పంపండి.**
**కూపను జతచేయడం మరువకండి!!!**

**135 & 136 సంచికలోని ప్రశ్నలు**

1. ఆలస్యము చేస్తే దొరకరు?
2. మహానుభావులలో వందనములు తీసుకుంటున్నదెవరు?
3. నువ్వు, నేను, అతడు, ఆమె, వాడు, వీడు....?

**సరైన జవాబు : అందరు**

**విజేతలు:** కరణం సుబ్రహ్మణ్యం నాయుడు (నంద్యాల), డి. వర్ణ (కరీంనగర్)

**విజేతలు కాని విజేతలు :** తెనాలి శేషగిరిరావు (పీలేరు), కె.వి.వి. సత్యనారాయణ (కొత్తగూడెం), ఎం. నిర్మల (విజయవాడ), వేదుల పార్వతి (హైదరాబాద్), కె. భాను (చెన్నై), వరాహగిరి సాంబశివరావు (గరివిడి), కోట లలిత (సికింద్రాబాద్), కొండపల్లి రామారావు (ఖమ్మం), నారాయణ చైతన్య (విశాఖపట్టణం), బి.ఎస్. ఎల్లంరాజు (సికింద్రాబాద్), రావులపల్లి సుజాత (హైదరాబాద్), బి. మదాలస (బెంగుళూర్), కొండిపర్తి వెంకట జగన్నాథదాసు (సికింద్రాబాద్), నర్సీపురం అనిల్ మోహన్ (హాంగ్‌కాంగ్), రామరాజు లక్ష్మీనారాయణ (గుంటూరు), పి. లక్ష్మీకృష్ణ (న్యూఢిల్లీ), పసుమర్తి కనకరాజు (హైదరాబాద్), కొవ్వూరి కోటయ్య (రేపల్లె), మాడుగుల సత్యకృష్ణ శ్రీనివాస్ (విజయవాడ), కె. గురుప్రసాద్ (అనంతపూర్), అల్లంరాజు లక్ష్మి (ముంబై), వేగేశ్న సీతారామరాజు (లంకల కోడేరు), కాకాని జ్యోతి (హైదరాబాద్), నర్సీపురం సువేద (హైదరాబాద్), ఎ. గోపీనాథరావు (విజయనగరం), తెన్నేటి రామలక్ష్మి (విశాఖపట్టణం), తెన్నేటి అహల్యాదేవి (హనుమకొండ), బావరాజు వెంకట మల్లికార్జునమ్ (హైదరాబాద్), పాలెపు బుచ్చిరాజు (బరోడా)

పాఠకుడిని కావలి గదా! అందుకే నియమంగా 'రచన' చదవాలని నా చందా పంపుతున్నాను.

మీరు యీ ఉత్తరం చదువుతున్న సమయానికి, మీరు పంపిన 'ఉగాది' సంచిక నేను చదువుతూ ఉండవచ్చు. ఆ సంచిక అందగానే ఒక ఇ-లేఖని పంపుతాను.

ఉడతాభక్తి కలిగినా, ఏం చెయ్యాలో తెలియని పరిస్థితిలో ఉన్నాను. 'రచన' పది కాలాలు పచ్చగా ఉండటానికి నేను చెయ్యగల సహాయం ఏమన్నా ఉంటే తెలుపగలరు.

**- అనిల్** *(కాలిఫోర్నియా)*

పత్రికా నిర్వహణ కష్టతరంగా మారుతున్న ఈ రోజుల్లో కూడా, భారీ సైజు ప్రత్యేక సంచికగా, సర్వాంగ సుందరంగా 'రచన' (మార్చి 2004) పాఠకుల్ని అలరిస్తూ, చేతికి వచ్చిందంటే, దీని వెనుక నిర్వాహకుల అంకితభావం ఎంతగా ఉందో విదితమవుతున్నది.

హావభావాల సహజ నటుడు, కీ॥శే॥ నాగభూషణంగారిని ఈ సంచికలో స్మరించటం ఎంతో సముచితంగా ఉంది. ఈ వ్యాసం చదువుతున్నంతసేపు, వరంగల్‌లో సతీసమేతంగా మా ఇంట్లో ఆతిథ్యం స్వీకరించిన ఆనాటి స్మృతులు మదిలో మెదుల్తూనే ఉన్నాయి.

తానా కథాసాహితిలో బహుమతి పొందిన పెద్దింటి అశోక్‌కుమార్‌గారి 'ఆ ఇల్లు మూతవడ్డది' అనే కథానిక, కేతు విశ్వనాథరెడ్డిగారి 'దాది' వంటి ఇతర కథలు కూడా, మనస్సుకు హత్తుకునేలా ఉన్నాయి. వెల కాస్త ఎక్కువనిపించినా, రకరకాల శీర్షికలతో అలరిస్తూ, ఉల్లాసం కలిగిస్తూ హాయిగా చదువుకోవడానికి కావలసినంత సామగ్రి అందించినందుకు అభినందనలు.

పజ్లింగ్ పజిల్ విజేతలకు బహుమతులందించటంలో జాప్యం జరగకుండా చూస్తే బాగుంటుంది.

**- తెన్నేటి అహల్యాదేవి**
*(హనుమకొండ)*

**మీ ఊళ్ళో**
రచన ఇంటింటి పత్రిక
**దొరకడం లేదా?**
**తరణోపాయం?**
**చందాదారులుగా**
**చేరడమే!**

'రచన' ఇంటింటి మాసపత్రికలో నా కార్టూన్‌కి బహుమతి రావడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. ఈ విషయం ఇంతకుముందు చెప్పినా మరోసారి మీకు చెప్పడంలో ఆనందం కలుగుతుంది. మీరు పంపిన పుస్తకాన్ని (కాంప్లిమెంటరీ కాపీని) అందుకున్నాను. ఆ తరువాత బహుమతి పారితోషికాన్ని అందుకున్నాను. నాలాంటి వారిని ఇలాగే ప్రోత్స హిస్తారని ఆశిస్తూ... ముందు ముందు మరిన్ని మంచి కార్టూన్స్‌తో కలుస్తూ ఉంటాను. మరొక్కసారి మీకూ.. 'రచన' సిబ్బందికి మరియు శ్రీ గోపి బూరుగు గారికి రచనాభినందనలు.

**- అడ్డూరి వెంకటరమణ**
*(విజయవాడ)*

❁